# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-10-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలసికట్టుగా, సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, శాసన సభ్యులకు పిలుపునిచ్చారు.

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23వ తేదీన జరుగనుంది.

- విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టిందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు.

- మధ్య బంగాళాఖాతంలో ఈ నెల 22వ తేదీన అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

========================

రాష్ట్ర అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పని చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులకు, శాసన సభ్యులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని, 'ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి' అనే నినాదంతో మిత్రపక్షాలను సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్లాలని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే బాధ్యత అందరపై ఉందని అన్నారు. అధికారంలోకి రాగానే 7 అంశాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని ముఖ్యమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 31 సెకన్లు)

========================

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 23వ తేదీన జరుగనుంది. ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలకు చెందిన మంత్రులు హాజరుకానున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఇటీవల

జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధిపై 6 కొత్త పాలసీలు తీసుకొస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈసారి జరుగనున్న సమావేశంలో మరికొన్ని అంశాలను చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు.

=========================

విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా తగ్గుముఖం పట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ఈరోజు గుర్ల గ్రామంలో పర్యటించిన కలెక్టర్  డయేరియాను అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలపై అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రామంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని అన్నారు.  ఈరోజు కొత్తగా 6 కేసులు మాత్రమే నమోదయ్యాయని, బాధితులకు మెరుగైన చికిత్సను అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సంభవించిన మరణాల్లో కేవలం ఒక్కరు మాత్రమే డయేరియా కారణంగా మృతి చెందారని తెలిపారు. వైద్య ఆరోగ్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు.

=========================

భారత సైన్యంలో అగ్నివీర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గుంటూరులోని ఆర్మీ రిక్రూట్ మెంట్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అగ్నివీర్ జనరల్, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్ వంటి పలు ఉద్యోగాలకు నవంబరు 10 నుండి 15వ తేదీ వరకు గుంటూరులోని డి.యస్.ఏ స్టేడియంలో ఆర్మీ ర్యాలీని నిర్వహించనున్నామని పేర్కొంది. మరిన్ని వివరాల కోసం www.joinindianarmy.nic.in వెబ్ సైట్ ను సందర్శించాలని సూచించింది.

=========================

మంగళగిరి సి.కె. కన్వెన్షన్ లో ఈనెల 22, 23వ తేదీల్లో జాతీయ డ్రోన్ సమ్మిట్ -2024 ను  రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ సదస్సు ఏర్పాట్లపై ఈరోజు రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. 22వ తేదీ జరిగే ప్రారంభోత్సవ సభలో 1,000 మంది ప్రతినిధుల హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు సాయంత్రం కృష్ణా తీరం పున్నమీ ఘాట్‌లో 5 వేల డ్రోన్లతో మెగా షో నిర్వహించనున్నారు.

=========================

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం, నాణ్యమైన విద్య అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. పార్వతీపురం మండలం డోకిశీల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఈరోజు కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అంగన్వాడీ కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిల్లలు ఆడుకోవడానికి అనువుగా ఉండేలా పార్కును ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల బరువు, ఎత్తు వివరాలను ప్రతి రోజు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు.

విరామం

=========================

తూర్పు మధ్య అరేబియా సముద్రం మీద వున్న ఉపరితల ఆవర్తనం కర్నాటక, రాయలసీమ మీదుగా దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం వరకు కొనసాగుతుందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.  మరోవైపు  ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఈనెల 20వ తేదీ నాటికి ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశముందని వాతావరణ అధికారిణి తెలియజేస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=========================

పట్టణాల్లో సాంకేతికతను ఉపయోగించి మెరుగైన సేవలు అందించాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈరోజు భీమవరంలో జిల్లాలోని అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ... ఇతర రాష్ట్రాల్లోని మున్సిపాలిటీల్లో అమలు చేస్తున్న సాంకేతికతను అధ్యయనం చేసి మెరుగైన వాటిని జిల్లాలో అమలు చేయాలని సూచించారు. పట్టణాల్లో స్వచ్ఛతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని పార్కులలో వాకింగ్ ట్రాక్ లను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ లకు మరమ్మత్తులను చేయించి వినియోగంలోకి తీసుకురావలని, తద్వారా ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ సూచించారు.

=========================

రాజమహేంద్రవరంలో రేపటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు శ్రీకాకుళం జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో శిష్టు లక్ష్మీ చేతన్, అండర్-14 విభాగంలో మల్లారెడ్డి త్రిలోచన్ వెంకట సాయి ప్రసాద్ లు ఈ పోటీలకు హాజరు కానున్నారు. విద్యార్థులిద్దరూ ఈ పోటీలకు ఎంపిక కావడం పట్ల శిక్షకుడు తిరుమల హరీష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో రైఫిల్, పిస్టల్ షూటింగ్ కు ఆదరణ లభిస్తుందని, భారత రక్షణ రంగంలోని నేవి, ఎయిర్ ఫోర్స్, కోస్ట్ గార్డు, ఇంకా అనేక ప్రభుత్వ ఉద్యోగాలలో షూటింగ్ లో పతకాలు సాధించిన విద్యార్థులకు అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. విద్యార్థులు భవిష్యత్తులో రైఫిల్ షూటింగ్ లో జిల్లాకు మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

=========================

పార్వతీపురం మండలం డెప్పివలన గ్రామంలో నిర్మిస్తున్న వన్ ధన్ వికాస్ కేంద్రాన్ని (వి.డి.వి.కె) వినియోగించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మహిళలకు పిలుపునిచ్చారు. ఈరోజు గ్రామ పర్యటనలో భాగంగా ఆయన వన్ ధన్ వికాస్ కేంద్రం పనుల పురోగతిని పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలో గిరిజనులకు కొండచీపుర్లు తయారీపై శిక్షణ వస్తున్నామని, కేంద్రం సిద్ధం కాగానే ఉత్పత్తులు ప్రారంభంకావాలని ఆకాంక్షించారు. వి.డి.వి.కె.లు ఒకే కాలనీకి పరిమితం కాకుండా సంవత్సరం మొత్తం ఉత్పత్తులు వచ్చేలా కృషి చేయాలని అన్నారు.

=========================

శ్రీకాకుళంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో త్వరలో ప్రారంభం కానున్న హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. విజయకుమార్ ఒక ప్రకటన లో తెలిపారు. లైట్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన 21 సంవత్సరాలు నిండిన వారు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, వివరాలకు 80746 40792, అలాగే 73829 23293 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

=========================

సమాజంలో దివ్యాంగులను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతీ నెల మూడవ శుక్రవారం స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఈరోజు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ (స్వాభిమాన్) అర్జీలను సంబంధిత అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించాలని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దివ్యాంగులు తమకు ఉపాధి కల్పించాలని, అలాగే పింఛన్లు, బ్యాంక్ రుణాలు ఇవ్వాలని కోరుతూ అర్జీలు సమర్పించారని కలెక్టర్ తెలిపారు.

=========================
=========================